రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పదో వార్డులో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య, స్థానిక కౌన్సిలర్ శశికళతో కలిసి హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొంత కాలంగా మున్సిపాలిటీలో ప్రజల కోరుతున్న సీసీ రోడ్డు పనులను 4–5 నెలల్లో పూర్తి చేయిస్తామన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత క్రమంలో సంబధిత పనులను చేపడుతామన్నారు. కౌన్సిలర్ రవీందర్, మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజు ముదిరాజ్, నేతలు జంగయ్య యాదవ్, ఆంజనేయులు, శశిధరన్, దేవేందర్ ముదిరాజ్, రంగయ్య, గోపాల్, భూషణం, శ్రీనివాస్, సురేశ్, లింగం, ప్రణయ్‌కుమార్, రవి, పొన్నయ్య, రమేశ్, ప్రవీణ్, మల్లేశ్, అమర్, నందు, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆందోళన వద్దు అండగా ఉంటాం : ఈటల


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

హైడ్రా బాధితులకు ఎంపీ భరోసా

మౌలాలి : ఆర్టీసీకాలనీ, కృష్ణనగర్, శివానందనగర్ కాలనీవాసులకు ఎంపీ ఈటల రాజేందర్ ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మీకు అండగా నేనుంటానని పేదవాడి జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదని హైడ్రా అధికారులను హెచ్చరించిన ఎంపీ చెరువుల పరిరక్షణ, సెప్టిక్ ట్యాంకులపై ప్రశ్నించారు. చెరువులను కాపాడదలుచుకుంటే చెరువులో వర్షపునీరు తాగునీరుగా ఉండాలి. గుర్రపు డెక్క వాటి ద్వారా వచ్చే దోమలు దుర్గంధం వాసన వచ్చేది చెరువు కాదన్నారు. ' గత 40 ఏళ్లుగా ఇల్లు కట్టుకుని ఉంటున్న 50, 80 గజాల్లో ఇళ్లు కట్టుకున్న పేదవాళ్ల ఇళ్లనా మీరు కూల్చదల్చుకున్నది వాళ్ల ఇళ్లు కూల్చడానికి వస్తే మా శవాల మీదుగానే బుల్డోజర్లు వెళ్లాల్సి ఉంటుందని' మల్కాజిగిరి ఎంపీ హెచ్చరించారు. బండ చెరువు చుట్టూ 18 కాలనీలు 35 ఏళ్ల క్రితం ఏర్పడ్డాయన్నారు. బండ చెరువు చుట్టూ ఉన్న శివానంద్‌నగర్, కృష్ణానగర్, సింహాద్రినగర్, ఎస్బీహెచ్ కాలనీ, పీవీ సూర్యనగర్ కాలనీవాసులకు భరోసా ఇస్తున్నానని మీరెవరూ ఆందోళన పడొద్దని ధైర్యం చెప్పారు. కార్పొరేటర్లు సునీతాశేఖర్‌యాదవ్, క్యారం రాజ్యలక్ష్మి, శ్రావణ్‌కుమార్ బీజేపీ నేతలు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో కాప్రా టాప్ 10


ర్యాలీ చేపట్టిన మున్సిపల్ సిబ్బంది.

కాప్రా: స్వచ్ఛభారత్‌లో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణలో దేశంలోనే కాప్రా మున్సిపల్ సర్కిల్ టాప్ 10లో చోటు సంపాదించిందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ అనురాధ తెలిపారు. సఫాయిమిత్ర సురక్ష శివిర్‌లో భాగంగా గురువారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ కాప్రా నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం పారిశుద్ధ్య, ఎంటమాలజీ సిబ్బంది చేపట్టిన కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకుని, పలు సలహాలు, సూచనలు చేశారు. విధి నిర్వహణలో అవగాహన, ప్రతిభ కలిగిన పలువురికి బహుమతులు అందజేసి అభినందించారు. అంతకు ముందు కాప్రా సర్కిల్ కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కమలానగర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం మీదుగా తిరిగి సర్కిల్ ఆఫీస్‌కు చేరుకుంది. చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబు, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ఏఎంహెచ్‌ఓ, ఎంటమాలజీ ఏఈ, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి


మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నిర్వాహకులు

కుత్బుల్లాపూర్: అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నియోజకవర్గంలోని పలువురు ప్రజలు, సంక్షేమ సంఘాల నేతలు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.

గాజులరామారం డీఈకి వినతిపత్రం

కుత్బుల్లాపూర్: సీపీఎం సూరారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గాజులరామారం సర్కిల్ డీఈ శిరీషకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు పసుల అంజయ్య, రావుల స్వాతి, నాయకులు సంజీవరాజు, అంబయ్య, కృష్ణ, లక్ష్మి, దుర్గానాయక్, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డీఈ శిరీషకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



పద్మావతి, వేంకటేశ్వరస్వామి

కాప్రా: కుషాయిగూడ శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శరన్నవరాత్రోత్సవ సహిత శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. గురువారం కలశ స్థాపనతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 13వ తేదీ వరకు కొనసాగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు కలశస్థాపన, అభిషేకం అలంకారంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయం విద్యుత్ దీపాలతో అలకరించడంతో చూపరులను ఆకట్టుకుంటోంది. స్వామి, అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు.


రాంపల్లిలో భవానీదేవిగా కొలువైన దుర్గామాత


చీర్యాలలో మహాలక్ష్మి అలంకరణలో...


అన్నోజిగూడలో బాలాత్రిపుర సుందరీ దేవిగా...

బాలాత్రిపురసుందరిగా అమ్మవారు

- అంగరంగ వైభవంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వాడవాడలా నేత్రపర్వంగా అమ్మవారి మండపాలు

మేడ్చల్: దసరా పర్వదినం నేపథ్యంలో మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో దేవీ శన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మేడ్చల్ మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాలలో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని గడిమైసమ్మ ఆలయంలో వందలాది మంది భక్తులు భవానీ దీక్షలు స్వీకరించారు. వివిధ కాలనీలలో అమ్మవారి విగ్రహాలను మండపాలలో ఏర్పాటు చేసి పూజలు చేశారు.

కీసర మండల పరిధిలో...

కీసర: కీసర మండల పరిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో దేవీ నవరాత్రులను ఆలయ ఫౌండర్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి చేతుల మీదగా వేదపండితుల మంత్రోచ్ఛరణతో వైభవంగా ఆరంభించారు. మొదటి రోజు మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కీసరగుట్టలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు కొలువుదీరారు. రాంపల్లిలోని దుర్గామాత మండపంలో భవానీ దేవిగా పూజలు అందుకున్నారు.


కీసరగుట్టలో బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు

అన్నోజిగూడ గాయత్రీ ఆలయంలో...

పోచారం: అన్నోజిగూడలోని గాయత్రీమాత ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యా నాయక్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.

ఘట్‌కేసర్ పరిధిలో...

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అవుషాపూర్, అంకుషాపూర్, ఎదులాబాద్, ఘట్‌కేసర్‌లో అందంగా అలంకరించిన మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, అవుషాపూర్‌లో, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు ఎదులాబాద్, ఘట్‌కేసర్‌లో చైర్ పర్సన్ పావనీజంగయ్య, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, ముత్యాలుయాదవ్ అమ్మవారిని వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


గాయత్రీమాత ఆలయంలో ధ్వజారోహణ నిర్వహిస్తున్న వేద పండితులు


ఘట్‌కేసర్‌లో చైర్ పర్సన్ పావనీజంగయ్య


ఎదులాబాద్‌లో బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్


అవుషాపూర్‌లో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి...

దసరా కోసం ప్రత్యేక బస్సులు

మేడ్చల్: దసరా సెలవుల నేపథ్యంలో మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో నివాసముంటూ దసర పండగ కోసం సొంత గ్రామాలకు వెళ్లే వారి కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు టీజీ ఆర్టీసీ మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. విద్యార్థులు, ఇతర వర్గాల వారి కోసం మేడ్చల్ నుంచి నిజామాబాద్, కరీంగనగర్, సిద్దిపేట, ఖమ్మం, వరంగల్, నల్లగొండ తదితర పట్టణాలకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. మహలక్ష్మీ పథకం వర్తించకుండా 30 నుంచి 40 మంది ఉంటే వారు ఉన్నచోటికే బస్సులు పంపుతామని ఆయన వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హెచ్‌ఎంటీ ఖాళీ స్థలంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలి

జగద్గిరిగుట్ట: హెచ్‌ఎంటీ ఖాళీ స్థలంలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు సహకరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్ అన్నారు. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో కలిసి సచివాలయంలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇతర జిల్లాలకు చెందిన సుమారు 50 బస్సులు రాత్రి నిలిపి ఉంటాయని దీంతో డ్రైవర్లు, కండక్టర్లకు కనీస సౌకర్యాలు లేకపోగా, ఇప్పుడున్న బస్టాప్ నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ, సమితి సభ్యుడు ఏసురత్నం, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు హరినాథ్‌రావ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఉప్పల్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఏడుగురిని ఉప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ పారిశ్రామికవాడ జెర్సీ కంపెనీ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి ఎస్ఓటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బియ్యాన్ని తరలిస్తున్న అదుపులోకి తీసుకున్నారు. లారీలో దాదాపుగా 100 బ్యాగులు (5టన్నులు) ఉన్నట్లు తేలింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించండి


దేవుడి పటాలను సేకరిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్, సిబ్బంది

మల్కాజిగిరి: ప్రజలు పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛసర్వేక్షణ్‌కు సహకరించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ అన్నారు. గురువారం సర్దార్‌పటేల్‌నగర్‌లో జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి దేవుడి పాత పటాలు, ఉపయోగించని పూజా పుస్తకాలను ఇంటింటా తిరిగి సేకరించారు. పవిత్రంగా పూజచేసే పటాలు పనికిరాకపోతే వాటిని చెరువులు, దేవాలయాల వద్ద వదిలిపెట్టడం సరికాదన్నారు. చెత్తను కూడా బహిరంగ ప్రదేశాల్లో పారవేయకుండా స్వచ్ఛ కార్మికులకు అందజేయాలన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది గిరి, బాలామణి, రాజు, రవి, నందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నార్త్ సిటీ మెట్రో సాధనకు పోరాటం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నార్త్ సిటీ మెట్రో సాధనకు ప్రజల తరఫున పోరాడుతామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నగరంలోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 69 కిలోమీటర్ల మేర మెట్రోను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. అంతేగాకుండా ఎంతో ముందుచూపుతో రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రోను తీసుకెళ్లాలని నిర్ణయించారన్నారు. నాడు మెట్రో రెండో దశ పనులకు రూ. 24 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ. 11 కోట్లు పెట్టిందన్నారు. అలాగే సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్, ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు మెట్రో రైల్‌ను విస్తరించేందుకు పెట్టిన ప్రతిపాదనలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రద్దు చేసిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా మోసం చేసినట్లుగానే మెట్రో రద్దుతో కుత్బుల్లాపూర్, మేడ్చల్, అల్వాల్, కుత్బుల్లాపూర్ ప్రజలను కూడా మోసం చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా నార్త్ సిటీ మెట్రో రద్దును ఉపసంహరించుకోకుంటే ప్రజలతో కలిసి నిరసనలు చేపడుతామని హెచ్చరించారు.

పోక్సో కేసులో మాజీ ఉపాధ్యాయుడికి జైలు


వెంకటరమణ (ఫైల్)

మల్కాజిగిరి: విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన మాజీ ఉపాధ్యాయుడికి పోక్సో కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా కొమరాడ మండలం రావికాలవలస గ్రామానికి చెందిన ఉడుతల వెంకటరమణ (40) 2016లో మౌలాలిలోని గౌతమ్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేసేవాడు. పదోతరగతి చదివే ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం కేసు విచారించిన స్పెషల్ పోక్సోకోర్టు న్యాయమూర్తి విక్రమ్ వెంకటరమణకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ. 5000 జరిమానా, బాధితురాలికి రూ. 25 వేల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు వెలువరించారు.

అత్యుత్తమ టెక్నాలజీ అందిస్తాం

సాక్షి సిటీబ్యూరో: వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ వాసుల అభిరుచులకు తగ్గట్టు అత్యుత్తమ టెక్నాలజీతో కూడిన ఉత్పత్తులు అందిస్తామని ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ అకాయ్ ఇండియా ఎండీ అనురాగ్‌శర్మ అన్నారు. తమ నూతన మోడల్స్ 254 సెం.మీ, 190 సెం.మీ టీవీలను సిటీ మార్కెట్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఉత్పత్తులు అత్యాధునిక ఫీచర్లు కలిగి ఉన్నాయని వివరించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

గౌతంనగర్: మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని రైల్వేగేటు సమీపంలోని వీధిలో రూ. 35 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. నాయకులు నిమ్మ అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శకుంతలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కీసరలో స్వస్థత మహా సభలు ప్రారంభం

కీసర: క్రైస్తవ సువార్త, దైవిక స్వస్థత వార్షిక మహా సభలు టీపీఎం చర్చి ఆధ్వర్యంలో కీసరలోని పోలీస్ స్టేషన్ పక్కనున్న ది పెంతెకొస్తు మిషన్ కన్వెన్షన్ గ్రౌండ్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ఈ సభలు ఆదివారం సాయంత్రం వరకు కొనసాగుతాయని పాస్టర్ శ్యాంసుందర్ తెలిపారు. ఆధ్యాత్మిక రక్షణ, బైబిల్ అనుభవజ్ఞానం పొందేందుకు ఇదే మంచి తరుణమని చెప్పారు. శారీరక, మానసిక రుగ్మతలతో బాధపడే వారి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశాలకు హాజరయ్యే వారికి ఉచిత భోజన వసతి సదుపాయాలు కల్పించామన్నారు. సికింద్రాబాద్ నుంచి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు ఫోన్స్: 73861 34864, 92903 11366లలో సంప్రదించవచ్చని కోరారు.

సీసీ కెమెరాల నిర్వహణపై సమీక్ష


మాట్లాడుతున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం పురపాలక సంఘ కార్యాలయంలో చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన సీసీ కెమెరాల నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ... ఇంతకు ముందు సీసీ కెమెరాల నిర్వహణ చేసిన ఏజన్సీతో ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేయించాలని, ప్రతి వారం నిర్వహణ నివేదికను అధికారులకు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇలా చేయడం వల్ల దొంగతనాలు అరికట్టవచ్చన్నారు. సమావేశంలో కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ ఎ.నాగమణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుదర్శనం, మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పంచమ వార్షికోత్సవం


ఘనాపూర్‌లో పూజలు చేస్తున్న మహేశ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘనాపూర్‌లోని శ్రీ జగదాంబ దేవి సహిత శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ పంచమ వార్షికోత్సవం ప్రత్యేక భోగ్ భండార్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, రూప్‌సింగ్‌తో కలిసి హాజరై శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్‌ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నేతలు రాజునాయక్, హుస్సేన్‌నాయక్, సురేశ్‌నాయక్, చాంది, రాణి, కిషన్‌నాయక్, పవన్‌నాయక్, చందర్, రమేశ్, సురేశ్, దేవ్‌సింగ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సింగం చెరువుతండాలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని కాంగ్రెస్ గ్రేటర్ నేత నెమలి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం తండాలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలతో దోమల బెడద అధికంగా ఉందని పేర్కొన్నారు. తండాలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మల్లాపూర్ డివిజన్ ఎస్సీసెల్ అధ్యక్షుడు మహేష్‌నాయక్, బాలు, రాజు, మేఘనాథ్, రమేష్ , లింగరాజ్, రాజు, నరేష్, నీరజ్, అజయ్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతతోనే నీటి సంరక్షణ


అల్వాల్‌లో స్పెషల్‌డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: ఇంకుడు గుంతతోనే నీటి సంరక్షణ అని, వర్షపు నీటిని వృధా చేయొద్దని, ప్రతి నీటి చుక్కను భూగర్భ జలంగా మార్చాలని కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రేటర్‌లో సీవరేజి ఓవర్‌ఫ్లో, ఇంకుడు గుంతల నిర్మాణంపై జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్‌డ్రైవ్‌ను గురువారం అల్వాల్ డివిజన్ గోగ్రీన్ గాబ్రియల్ అపార్ట్‌మెంట్ వద్ద కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, శేఖర్, ఇమ్రాన్, మల్లేష్, ప్రేమ్, అరుణ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌పై విద్యార్థులకు అవగాహన

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, రాజీవ్‌నగర్‌లో విద్యార్థులకు బోస్కో సేవా సంస్థ ప్రతినిధులు పార్లమెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశ అత్యున్నత పార్లమెంట్‌పై చిన్ననాటి నుంచే అవగాహన కల్పించాలనే ఆశయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ ప్రతినిధులు అంబేడ్కర్, మౌనిక, సుమతి పేర్కొన్నారు.

వైకుంఠ ధామాల్లో మౌలిక సదుపాయాలు

ఉప్పల్: డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ అన్నారు. చిలుకానగర్ డివిజన్‌లోని శ్రీనగర్‌కాలనీలో గౌడ కులస్తుల శ్మశానవాటికలో నీటి సదుపాయం కోసం నూతనంగా బోర్ వేయిస్తున్నట్లు తెలిపారు. అన్ని శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, బజారు జగన్నాథ్‌గౌడ్, మురళి, బూత్కూరి వనీస్‌గౌడ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.